

అరవయ్యో పడిలో పడిన అనంతరావుగారు మూడు ఎదులు నిండని అకాలతని వివాహం చేసుకోబోతున్నారన్న సంగతి ఒక అతి ముఖ్యమయిన వార్త అయింది క్లబ్బులో.

వయసు మళ్ళినా ఆశలు చావలేదు మరి. అందుకే అకాలతను చేసుకుంటున్నాడు. అన్నాడు సోమయాజులు గోల్డు ఫ్లేక్ సిగరెట్ పొగ నోటినిండా పీల్చుకుని బయటకు వదులుతూ.

"ఆయన కేమండీ! విలాస పురుషుడు... రసికుడు," అంటూ వైన్ గ్లాసుసిప్ చేసి బల్లమీద పెట్టాడు నిరంజనరావు.

"అకాలత ఈడుది కూతురుకూడా వున్నది ఆయనకు. నలుగురు పిల్లల తల్లికూడా అయింది .. ఈ వయసులో పెళ్ళేమిటి! పిచ్చిగాక పోతే!" చక్రపాణి అన్నాడు నోట్లోనుంచి సిగార్ తీసి కొడిని ఏష్‌ట్రేలో దులుపుతూ.

"ఈ సంగతి గనక రమణమూర్తికి తెలిస్తే ఎంత బాధ పడతాడో." సానుభూతి చూపించాడు నిరంజనరావు

సోమయాజులు చిరునవ్వు నవ్వాడు

'ఏమనుకుంటాడు. ప్రైవేట్ ఆఫీసరుగదా! తండ్రికితగ్గ కొడుకు... తండ్రి చేసిన పనిని తప్పక హర్షిస్తాడు ఏడాదికోసారి కలవలకని యింటికివచ్చినప్పుడు ఆ మాత్రం ఆదరించే వ్యక్తి అకాలత వంటి ఆకర్షణీయమైన వ్యక్తి ఉంటే, రమణమూర్తి మాత్రం సంతోషించడూ "

'కరెక్ట్! నా అభిప్రాయంకూడా అదే రమణమూర్తి భార్య కురూపి. అతనికి తగిన భార్యకాదు. అన్నాడు చక్రపాణి

"అందుకని ముసలితండ్రి పడుచుపెళ్ళాన్ని చేసుకుంటున్న వార్త రమణమూర్తికి సంతోషదాయమయిన సంగతే లక్కీ ఫెలో!' సోమయాజులు అన్నాడు బల్లమీదవున్న యింగ్లీషు మేగజైనులో అర్ధనగ్నంగా ఉన్న బొమ్మలనుచూస్తూ.

'ధన మూలమిదం జగత్ డబ్బుగలవాడు బట్టలు విప్పుకుని నడిబజారంట నడిచివెళ్ళినా. యిదికూడా ఒకఫ్యాషను కాబోలనుకుంటారు జనం, అదేపని కూటికి లేనివాడు చేస్తే... పిచ్చివాడని రాళ్ళు రువ్వుతారు .. అనంతరావుగారు పడుచుపిల్లని పెళ్ళిచేసుకోవటం కూడా అలాంటిదే!" అన్నాడు నిరంజనరావు గ్లాసులోని ద్రవపదార్థాన్ని పూర్తిగా సిప్ చేసి

"అకాలతను మీరెవరయినా చూశారా!" చక్రపాణి అడిగాడు.

'ఆహా, భేషుగ్గా... అందగత్తె కుందనపు వన్నెలు, హంగులు, ఆభరణాలు, అన్నీ ఉన్నాయి... స్కూలు మేష్టర్ చేసి పెంచుకున్న సుబ్బరామయ్యగారి జ్యేష్ఠపుత్రిక. ఆమెను నేను ఎరుగుదును.' అప్పుడే వచ్చిన శివరాం చక్రపాణి పక్కనున్న ఖాళీకుర్చీలో కూర్చుంటూ.

'పూర్ ఫెలో! బిడ్డకు తగిన సంబంధం తేలేక, డబ్బులకు ముసలాడికి అమ్మేస్తున్నాడు. మైగాడ్! యిది యిరవయ్యో శతాబ్దమా? పాషాణహృదయులు, అన్‌సివిలైజ్డు బ్రూట్సు, జీవించే పాతరాతి యుగం యిది " అన్నాడు శివరాం, సోమయాజులు ముందున్న గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్ టిన్నులోనుంచి ఒక సిగరెట్ తీసి నోట్లో పెట్టుకుని లైటరు కోసం నిరంజనరావువేపు చేయిచాస్తూ.

నిరంజనరావు లైటరు అందించాడు. శివరాం సిగరెట్టు వెలిగించుకున్నాడు.

"తండ్రిచేస్తున్న ఘనకార్యం కొడుక్కు తెలుసంటావా అసలు!" నిరంజనరావు ప్రశ్నార్థకంగా చూశాడు

'తెలిసినా తెలియకపోయినా ఒకటే! తండ్రి మాటకు ఎదురాడని పితృవాక్య పరిపాలకుడు రమణమూర్తి. అందుకే ఆయన చూపే సెలక్టుచేసి పిల్లమెడలో... కిక్కురుమనకుండా తాళికట్టేశాడు. ఆ పిల్లతో సంసారం చేస్తున్నాడు ... కాదు. చేస్తు

న్నట్టు నటిస్తున్నాడనుకోండి...వాడికేం ఎయిర్ ఫోర్సులో వసుక్లాసయిన ఉద్యోగం. వందలకొద్దీ జీతం నైట్‌క్లబ్బులూ వ్యవహారం. యింకా భార్య ఊరికే యింట్లో అలంకారంగామాత్రమే ఉంటుంది శివరాం వివరించాడు.

"ఈ విషయాలు తెలీవుగానీ, ఆ మధ్యవచ్చిన యిండో - పాక్ యుద్ధంలో గొప్ప ప్రమాదం తప్పించుకుని బ్రతికి బయటపడ్డారనీ యిదంతా అతని భార్యకున్న పతిభక్తి దైవభక్తి కారణమనీ అనంతరావుగారోసారి చెప్పారు కొడుకు అంబాలా హాస్పిటల్లో ఉండగా కోడలు యింటిదగ్గర ఉండి అహర్నిశలు పూజలూ అవీ చేసిందని. దాని మహిమవల్లనే 'సైనిక ఆస్పత్రిమీద బాంబులు పడ్డాకూడా, కొడుక్కి ఏమీ అపాయం కలగలేదనీ, చెప్పారు అనంతరావుగారు " అన్నాడు సోమయాజులు వేళ్ళదాకా వచ్చిన సిగరెట్‌ను ఏష్‌ట్రేలో పడేస్తూ.

"ఇదొక పెద్దజోక్ " అన్నాడు శివరాం విరగబడి నవ్వుతూ. "మంత్రాలకు చింతకాయలు రాల్తా యన్నాట్ట వెనకటికో పెద్దమనిషి ... అట్లా ఉంది మీరుచెప్పేది వింటుంటే '

టెలిఫోను రింగ్‌రింగ్‌మని మోగింది. రిసీవరందుకుని "మిషరు శివరాం హియరీజ్ కాల్‌ఫర్ యూ అని రిసీవరు అందించాడు చక్రపాణి

"ఎస్. శివరాం మాట్లాడుతుంట ... పూలు, కొబ్బరికాయ, పండ్లుకావాలా ! .. అమ్మకా !... తమల పాకులు కూడా నా ... రేపు వ్రతా నికా . మరి మంత్రాలు చెప్పడానికో పురోహితుడు కావద్దూ . హాస్యంకాదు నిజంగానే...అన్నింటినీ కలపి ఓటాక్సీలో ఎక్కించుకొస్తా రాత్రికి తెల్లవారి మళ్ళీ ఆలస్యం కాకుండా ... ఓమైగాడ్ వ్రతానికో పటంకూడానా . నాన్సెన్స్ ... యింటి దగ్గర రెండుకు చెప్పలేదు.. అహా జ్ఞాపకంలేదంటే సరి . కోపంలేదు సిమోహంలేదు.. పౌర్ణమి రేపే రావాలా ... సరేలే ! అలసిపోయినావ్ .. రెస్ట్ తీసుకో ' శివరాం రిసీవరు పెట్టేశాడు

'...ఛీ ! స్వర్గానికెళ్ళినా సవతి పోరు తప్ప లేదన్ . క్లబ్‌కు వచ్చినా యింటి దగ్గరనుంచి యిండెంట్లు తప్పవు." శివరాం ప్రశాంతంగానే విసుక్కున్నాడు

'మీయింటోనూ గా పూజలు వ్రతాలు తప్పవన్న మాట " కుతూహలంగా అడిగేడు నిరంజనరావు.

'మన ఆడవాళ్ళను రాకెట్‌లో పెట్టి చంద్ర మండల పంపిస్తే ఏమీ తోచకపోతే, భజన మండలి ఒకటి స్థాపించుకుంటారు కాలక్షేపానికి, యింకా మనవాళ్ళలో దేముడూ . దెయ్యమూ అనే పిచ్చి నమ్మకాలుపోలేదు ఇప్పుడిప్పుడే పోయే సూచనలు కూడా లేవనుకోండి.. భగవంతుడిపేర మనవాళ్ళు చేసే దుబారా ఖర్చు గనక అరికడితే దేశానికి ఆర్థికంగా ఎంతో సహాయం చేసినవాళ్ళ మవుతాం అన్నాడు శివరాం. ఆ సమయంలో యింటిదగ్గర నుంచి ఫోను వచ్చినందుకు లోపల ఉడికిపోతూ "

చక్రపాణి శివరాంవేపు ఓరగా చూశాడు. 'ఎంత వారలయినా కాంత దాసులే అన్నాడు అనుభవజ్ఞయిన త్యాగరాజు అందది శక్తిస్వరూపిణి, ఆమెను ఎదిరించే శక్తి మనకులేదు అన్నాడు చక్రపాణి

"మనకు లేదు, అని బహువచన ప్రయోగం ఎందుకు ?" అన్నాడు సోమయాజులు.

ఫోను మళ్ళీ మోగింది.

'సో మ యా జు లు అందుకున్నాడు. "సోమయాజుల్ని మాట్లాడు తున్నాను... ఆ!... ఆ !... ఎం కొంప మునిగింది పంటాడు మెట్ల మీదనుంచి జారి పడ్డాడా ... ఏడవలేక పోయాడూ'' మరి నువ్వెక్కడ నిద్ర పోతున్నావ్ ! ... గాభరాగా ఉంటె నన్నేం చెయ్యమంటావ్ ! ... డాక్టరుకు ఫోన్ చెయ్యి'. నేను వస్తాలే.. నువ్వేం చెప్ప క్కర్లేదు'' రిసీవరుపెట్టేసి అరచేత్తో మొహం రుద్దు కున్నాడు.

ఏం జరిగింది సార్ !' అని అడిగాడు నిరంజనరావు

'మా నాలుగోవాడు మెట్లమీదనుంచి కింద పడ్డాట్ట చెయ్యి మెలిక పడిందట. పట్నంయిలా తెలీదు పెద్దవలకు అని భార్యమీద తనకున్న ఆక్రోశ్య తను చాటుకున్నాడు సోమయాజులు

చక్రపాణి హుషారు తెచ్చుకుని, 'యివ్వాళ ఏమిటో బోరు కొడుతోంది సార్ ! ఎక్కడికి వెళ్ళినా ' అన్నాడు.

శివరాం టెలిఫోను షాక్‌నుంచి కోలుకున్నాడు.

"ఒక ఆట వేస్తేసరి, బోరుకాస్తా వదిలి పోతుంది' అన్నాడు.

అంతా ఒప్పుకున్నారు. శివరాం చప్పట్లు చరిచాడు. బోయ్ వచ్చాడు. కొంతపేక పట్టమ్మన్నాడు శివరాం. రెండు నిమిషాల్లో పేకతెచ్చి బల్లమీద ఉంచాడు బోయ్.

శివరాం పేక అందుకుని కలిపి ముక్కలు పంచేడు. అయిదు నిమిషాలు నిశ్శబ్దంగా ఆట సాగింది.

'అనంతరావుగారు. వివాహం దైవసాన్నిధ్యంలో చేసుకుంటాడట !" అన్నాడు శివరాం ముక్క విసిరి బల్లమీదవేస్తూ.

"అంతే ' చక్రపాణి అడిగాడు కుతూహలంగా.

"అంటే ఏముంది. తిరుపతిలో " శివరాం సమాధానం చెప్పాడు.

మనలాయన ఘటికుడే మరి హనీమూన్‌కి ఊటీ వెళ్ళాడా సోమయాజులు ప్రశ్న లాంటిది వేశాడు పేక కలుపుతూ

'ఊటీ కాదుసార్ కాశ్మీర్ కాశ్మీరం వెళ్లారు. అటునుంచి కొడుకు దగ్గరకు వెళ్ళి కొద్ది రోజులు అక్కడ గడిపి వస్తారుట " శివరాం సమాధానం చెప్పాడు.

'అవునుమరి ! ఒళ్ళికి రావటానికి అతనికి సెలవుంటుందో ఉండదో ! అందుచేత కొత్త దంపతులే కొడుకు దగ్గరకు వెళ్తే, చూసి సంతోషిస్తాడు రమణమూర్తి '

చక్రపాణి అన్న మాటలకు శివరాం కినుక్కున నవ్వాడు.

'ఆశాలత, రమణమూర్తిని ఎరగని పిల్ల... బయామ్ సారీ... మనిషేంకాదు లెండి యిప్పుడు కొత్తగా తెలియటానికి" అన్నాడు శివరాం

"మీరలా అలంకారాలు వేస్తూ, ద్వంద్వార్థాలుగా మాట్లాడితే మేము అర్థంచేసుకో లేమండీ !" అన్నాడు చక్రపాణి.

'అలా అయితే ఓ సిగర్ యిలా పడేయండి. తర్వాత కథ తాపీగా చెబుతాను ' అన్నాడు శివరాం.

చక్రపాణి అందించిన సిగర్ నోట్లో పెట్టు కుని, లేని అగ్గిపెట్టె కోసం జేబులు తడుము కుంటుంటే నిరంజనరావు లైటరు అందించాడు. శివరాం సిగర్ అంటించు కున్నాడు

'మీకూ, గిరీశానికి కొన్ని పోలికలున్నాయి సార్ !" అన్నాడు నిరంజనరావు

శివరాం ముందునొసలు చిట్లించుకుని, తర్వాత పెద్దగా నవ్వేశాడు. యిదికూడా నేనూహించ నంతటి పెద్ద జోకు సార్ ... అది పోనీయండి .. యిక ఆశాలత సంగతికి వద్దాం ...' అంటూ ఆగిపోయాడు వరండాలోనుంచి లోపలికి వస్తున్న కొత్త వ్యక్తిని చూసి

అతను వాళ్ళ ఎక్కడనుంచే లోపలి హాలులోకి వెళ్ళిపోయాడు.

"...అయ్యా, అదీ సంగతి " యిప్పుడు యిటుగా వెళ్ళి నటువంటి ఆ గం తు కు డు న్నా డే ... సారంగపాణి నా మ ధే యు డు. మ న కు కావలసినవాడు... అంటే మ న క థ కు... ఆశాలతకు స్వయాన మేనమామకొడుకు. అందు చేత మన సనాతన ధర్మాచారాల ప్రకారం. మా అమ్మాయినే కోడలు అన్నది ఆశాలత తల్లి సారంగపాణితల్లితో. ఈమెకూడా ఆమెతో చేతులోచెయ్యేసి చెప్పింది 'నీ కూతురు నా కోడలే' నని .. కాని పిల్లలు పెద్దవాళ్ళయి, ప్రయోజకులయ్యే వేళకు, చేలెన్నూ కుదరలేదు. సారంగపాణి ప్రేమతకు తగినంత బహుమతి లాంఛనాలు వగైరాలు యివ్వలే మన్నారు సుబ్బరామయ్యగారు. దాంతో వ్యవహారం యిరుకునపడింది. సారంగపాణి ఇంజనీరింగు చదువుకు ఖర్చుపెట్టినదంతా వడ్డీతో సహా రాబట్టుకున్నాడు అతనితల్లి రాజాలాంటి సంబంధం కలుపుకుని. ఆశాలతలో ఆశలంటూ ఉన్నయ్యో లేవోగాని... ఆమె ఆశలన్నీ కూలిపోయినయి. జీవితం వృధాఅనుకున్నది. పియూసీదాకా చదివిన చదువుతో కొన్నాళ్ళు అస్ట్రయిస్టు టీచరుగా పని చేసిం ది... ఆ తర్వాత టెలిఫోన్ఆపరేటరు అయింది... పొద్దునలేస్తే ఆమె తీయని గొంతుక వినడానికి ఎంతమంది తపస్సు చేస్తుంటారో మీకు తెలియకపోవచ్చు... ఆమె సంపాదనే ఆ కుటుంబానికి జీవనాధారం...'

సోమయాజులుకు ఆటకలిసింది. ముక్కలు దించాడు. ఆట మళ్ళీ మొదలయింది. నిరంజనరావు ముక్కలుకలిపి అందరికీ పంచాడు.

బోయ్ ' అని అరిచాడు సోమయాజులు. వాడు పరిగెత్తుకుంటూ వచ్చాడు. జనతా కూల్ డ్రింక్సులో నాలుగు గోల్‌స్పాట్‌లు తీసుకురా అని పురమాయించాడు.

'వివాహం అయి ఉద్యోగం మానేస్తే ఆ సంసారం ఎట్లా గడుస్తుంది !' చక్రపాణి ప్రశ్నించాడు.

బంగారపు పిచ్చుకలాంటి అల్లుడు దొరికితే యింక అమ్మాయి ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం ఏమిటండీ ! యిదే నిస్సంగాని !' అన్నాడు

శివరాం.

"ఎంత డబ్బున్న అల్లుడయితే మాత్రం ఎంత కాలం పోషిస్తాడేమిటండీ యిది ఇరవయ్యో శతాబ్దమని మర్చిపోతున్నారు" సోమయాజులు అందుకున్నాడు.

ఈసారి చక్రపాణి షో చేశాడు.

'డ్రింకులకు వెళ్ళినవాడు యింకా రాలేదేమిటి చెప్మా. పెళ్ళికి పంపితే చావు వేళకి వచ్చేరకం వీడు' అని విసుక్కున్నాడు శివరాం.

'వయసు మళ్ళిన ముసలాణ్ణి చేసుకోటానికి ఆకాలత ఎట్లా ఒప్పుకున్నది. అన్నది అర్థంగాని సమస్య." అని ఏదో పోగొట్టుకున్నవాడిలా నిట్టూర్చాడు నిరంజనరావు

"పాపం! ఇంతవరకీ మీరు భార్యా వియోగం అనుభవిస్తున్నారు గనక అంతగా బాధపడుతున్నారు లెండి!" అని విట్టువేశాననుకున్నాడు శివరాం

తన భార్య ఆరవ కాన్పుకు పుట్టింటికి వెళ్ళిన సంగతి ఎంత రహస్యంగా ఉంచినా బయటపడిపోయిందని కోపగించుకుని సర్దుకున్నాడు నిరంజనరావు

బోయ్ కూల్ డ్రింక్సు సీసాలలో స్ట్రాయివేసి బల్లమీద ఉంచాడు. నలుగురూ డ్రింక్సు తాగటం పూర్తిచేశారు.

'నిరంజనరావుగారికి ఆకాలతను గురించి కలిగిన సందేహం సమంజసమయిందే ... ఆమె అనంతరావుగారిని చేసుకోవటానికి యిష్టపడటంలో ఏదో ఆంతర్యం ఉన్నట్టు కనిపిస్తున్నది' అన్నాడు సోమయాజులు.

శివరాం అందుకున్నాడు. "అసలు పాయింటు టకీమని పట్టేశారు సోమయాజులుగారు. ఆంతర్యం లేకపోతే, అందమూ, చదువూ, వయసు కలిగిన బీద యింటి పిల్ల, ధనికుడయిన ముసలాడిని వివాహం చేసుకోవటానికి అంగీకరించిందంటే వింతే మరి!...ఆమె మనసు అనంతరావుగారిమీద గాక...రమణమూర్తి మీదకు మళ్ళి ఉండవచ్చు... బతికినన్ని రోజులు బతకబోడు ముసలాయన... ఆనక యిష్టారాజ్యం ..చిన్న ఎస్టేటుకు అధికారిణి. మరి" అని సాగదీశాడు.

'ప్రపంచం మారిపోయిందిసార్ ఎవరిననుకుని ఏం ప్రయోజనం." అన్నాడు సోమయాజులు.

"ఈ విషయంలో మాత్రం మనం ఎవరినీ నిందించలేము అనంతరావుగారు యింట్లో ఆడ దిక్షతకోసం ఆశపడ్డారు .. ఇంక ఆకాలత అంటారా డబ్బుకోసమూ తద్వారా రమణమూర్తిని నిరాటంకంగానూ యథేచ్ఛగానూ కలుసుకోవచ్చు ననే ఆశ...వయసుముదిరిన పెళ్ళిగాని ఆడపిల్లకు ఉండదగిన కోరికేమరి" శివరాం హాయిగా నవ్వాడు.

'మీరేమయినా అనండి యీసంగతి విన్నప్పటి నుంచీ నాకెందుకో బాధగా ఉన్నది." అన్నాడు నిరంజనరావు

'అంటే ఈ పెళ్ళి జరగటం మీకు యిష్టం లేదన్నమాటేనా!" సోమయాజులు సాగదీశాడు సిగరెట్టు వెలిగించుకుంటూ.

వెంటనే నిరంజనరావు అన్నాడు. 'అలాగే అనుకోండి! ఈపెళ్ళి ఏ కారణంవల్ల నయినా ఆగిపోతే బాగుండుననిపిస్తోంది."

'హృదయమున్న ప్రతివారికి అలాగే అనిపిస్తుంది. కాని ఏంచేస్తాం! మేరేజెస్ ఆర్ మేడ్ యిన్ హెవెన్." విధిబలీయం!" అన్నాడు శివరాం. భుజాలు ఎగరేస్తూ.

"ఇందాకేగదండీ భగవంతుడంటే నమ్మకం లేదన్నట్టు మాట్లాడారు." అని అడ్డు తగిలాడు చక్రపాణి.

"యిది కలికాలం సార్! నమ్మకం లేకపోయినా ఉన్నట్టు నటించాలి అవసరం ఉన్నప్పుడు.రాజకీయ నాయకుల మాటలకు చేతలకు ఎంత సంబంధం ఉంటుందో మీకు తెలియనిదికాదుగా!" శివరాం సమర్థించుకున్నాడు.

బాగా చీకటిపడింది, లైట్లతో దేదీప్యమానంగా వెలిగిపోతున్నది క్లబ్.

"ఈ పెళ్ళి జరక్కుండా మనం చెయ్యలేమా?" నిరంజనరావు అడిగాడు.

"మీరేమి అనుకోకపోతే నేనొకటి అడుగుతాను. నిరంజనరావుగారూ! మనం ఈ విషయంలో కలగజేసుకుంటే, కందకు లేని దురద కత్తిపీటకు ఎందుకు? అంటారు. అప్పుడు మీరేమంటారు.' శివరాం ఎదురు ప్రశ్న వేశాడు.

చెప్పు తీసుకుని పళ్ళూడ గొడతాను." అన్నాడు నిరంజనరావు కోపంగా.

శివరాంతోపాటు మిగతా యిద్దరూ నిర్ఘాంతపోయారు.

సోమయాజులు చిరునవ్వు తెచ్చుకుని అన్నాడు. 'టేకిట్ ఈజీ మిస్టర్ నిరంజనరావ్! నీకంత పట్టుదలే ఉంటే ..అలాగే కానివ్వండి ప్రయత్నం చేదాం ... అనంతరావుగారికే చెప్పిచూద్దాం ఈ ప్రయత్నం విరమించమని... ఆకాలత కేరెక్టరు మంచిది కాదని .. ఏ వేవో కల్పించి చెప్పవచ్చుగా ఆయన్ని నమ్మించటానికి."

'ఐడియా భేషుగ్గా ఉందిగాని పిల్లిమెళ్ళో గంట కట్టేదెవరు?' చక్రపాణి కలగ జేసుకున్నాడు.

'యింతకూ, నిరంజనరావుగారికి యీకేసులో ఉన్న యింటరెస్టు ఏమిటి అని నా సందేహం! శివరాం ఊరుకోలేక అడిగాడు.

నిరంజనరావు కుర్చీలో అటు నుంచి యిటు కదిలాడు విసుగ్గా.

'ఆకాలత సంసార పరిస్థితులు అవీ విన్నాక, నాకెందుకో ఆమె అంటే అదో విధమయిన సానుభూతి కలుగుతోంది. నాకేగనక అలాంటి తోబుట్టువుంటే చేతులుముడుచుక్కూర్చోను నేను. చావబోతున్న వాడికి వివాహం చేసుకోనివ్వను. రక్తపుపోటు, గుండెజబ్బు. ఉన్నవాడిని చేసుకుని జీవితంలో ఆమె ఏం సుఖపడ గలుగుతుంది!... యిక ఆమె అభిప్రాయం సంగతి శివరాం చెప్పిందంతా కేవలం ఊహాగానం మాత్రమే! ఉబుసుపోకకు ఆధారం లేకుండా చేసే ఆరోపణ అని నా అనుమానం అన్నాడు నిరంజనరావు.

శివరాం రోషం తెచ్చుకున్నాడు. నిరంజనరావు అంత చులకనగా మాట్లాడుతుంటే. "మీరనేది నాకర్థం కావటంలేదు. ఆకాలతకు రమణమూర్తి మీద ఉన్న మక్కువ వల్లనే ఈ పెళ్ళికి వప్పుకున్నది అన్నది కత్తిలేని సత్యం! తెలిసిందా? కావాలంటే రుజువుచేసి చూపిస్తాను .. అయినా పెళ్ళి అయ్యాక కొద్ది రోజులు ఓపిక పడితే మీకే తెలుస్తుంది.' సవాలు విసిరాడు శివరాం.

"నాదొక సలహా! మనం నలుగురం అనంతరావు గారింటికి వెళ్దాం యిప్పుడు. ఆయనకు నచ్చ చెపుదాం ఈ వివాహం మానుకోమని. వినకపోతే తర్వాతసంగతి ఆలోచిద్దాం"అన్నాడు నిరంజనరావు.

"ఆ ముసలాయన అసలే కోపిష్టి! అనవసర విషయాల్లో తల దూర్చటం మంచిది కాదని తిట్టి తరిమేస్తే అవమానం భరించలేం. క్లబ్‌లో యిదొక ముఖ్యమయిన వార్తయి కూర్చుంటుంది తెల్లవారేటప్పటికి.' అన్నాడు సోమయాజులు.

'అయితే ఒకపని చేద్దాం! మన వెంట ఒక ప్రెస్ రిపోర్టర్ని కూడా తీసుకు వెళ్దాం. కుశాలరావుకు ఫోను చేస్తే అయిదు నిమిషాల్లో వాల్తాడు. యింటర్వ్యూ చేసి ప్రముఖ వార పత్రికలో ప్రచురిస్తామనీ, వారి ఘనత కీర్తి చంద్రికలు నలుగురికి తెలుస్తాయనీ ఆశ పెడితే ఉబ్బితబ్బిబ్బయి పోతాడు..." శివరాం సలహా యిచ్చాడు.

అందరూ సరేనన్నారు. నిరంజనరావు అతని అయిడియాను మెచ్చుకున్నాడు శివరాం కుశాలరావుకు ఫోను చేశాడు

వెంటనే బయలుదేరి వస్తున్నానని చెప్పారు కుశాలరావు. అయిదు నిమిషాల్లో టాక్సీ వచ్చి గేటు ముందాగింది. కుశాలరావు కెమేరా, ఫ్లాష్ బల్బులు వగైరా సరంజామాతో వచ్చేశాడు.

అందరూ కలిసి టాక్సీలో బయలు దేరారు. ఎవరూ మాట్లాడటంలేదు. ఎవరి ఆలోచనలు వారివిగా ఉన్నాయి. కొన్ని నిమిషాలు దొర్లిపోయాయి. ఒక భవనం ముందాగింది టాక్సీ.

అయిదుగురూ టాక్సీ దిగారు.వరండా మెట్లెక్కి హాల్లోకి వెళ్ళారు

అనంతరావుగారు హాలులో సీలింగు ఫానుకింద పేముకుర్చీలో మెత్తని తెల్లని దిండ్లమీద కూర్చుని ఉన్నారు. చేతిలో ఉత్తరంలా అనిపించే కాగితం మడత గాలికి రెపరెప లాడుతున్నది.

"గుడ్ ఈవినింగ్ సర్!" అన్నారు అయిదుగురూ కలిసి కట్టుగా.

ఆయన వాళ్ళ వేపు చూసి కనుబొమలు చిట్లించి. "అప్పుడే మీదాకా వచ్చిందే ... యీ విషయం!" అన్నారు.

"మరే! యిలాంటి విషయాలు దాస్తే దాగుతాయా మన పిచ్చిగాని." అన్నాడు శివరాం తన సహజ ధోరణిలో.

అనంతరావుగారు మండిపడ్డారు కోపంతో. "ఏమిటయ్యా దాచేది!...ఆ పిల్లను ఆత్మహత్య చేసుకోమని చెప్పానా..." కోపంతోనూ విచారంతోనూ మాట్లాడలేక పోయారు.

ఆకాలత ఆత్మహత్య చేసుకుందన్న వార్త వాళ్ళను చకితుల్ని చేసింది.

★